క్లుప్తంగా

కలెక్టర్‌తో ఆర్టీఏ మెంబర్ రాజేశ్ భేటీ

నారాయణపేట: జిల్లా ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేశ్ మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన మాట్లాడుతూ భవిష్యత్ లో జరిగే రోడ్ సేఫ్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ధన్వాడ: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తేనే ఫలితం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పరిమల్‌కుమార్, డాక్టర్ శ్రీలత సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా కంసాన్‌పల్లి గ్రామంలో తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుకోవడం ఎలా అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పంట మార్పిడి, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్ కుమార్, ఏఈఓ సైమన్, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

మద్దూరు: మండలంలోని ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ జాగృతి సేనా నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ యూనిఫామ్స్, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. అలాగే పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అందించేలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ జాగృతి సేనా నాయకులు వెంకటయ్య, రమేష్, మురారి, రవి ఉన్నారు.

పాఠశాలకు రూ.50వేల విరాళం

ఊట్కూరు: మండలంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థుల క్రీడా సామగ్రి కోసం కొల్లూరు గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి, సమరసింహారెడ్డిలు మంగళవారం రూ.50 వేలు విరాళం అందజేశారు. మాజీ సర్పంచ్ భాస్కర్ చేతుల మీదుగా నగదును ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో తమ వంతు ఆర్థికసాయం అందించడం సంతోషకరంగా ఉందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రోశనప్ప, రమేష్‌బాబు పాల్గొన్నారు.

తీర్థయాత్రకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు

నారాయణపేట రూరల్: జిల్లా నుంచి తీర్థ యాత్రకు వెళ్లేవారి కోసం ఆర్టీసి ప్రత్యేక ప్యాకేజీతో బస్సులు నడుపుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్ అన్నారు. మంగళవారం వారు వేర్వేరుగా ఆర్టీసి మార్కెటింగ్ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్యాకేజీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యానగుంది నుంచి అరుణాచలం వరకు ప్రత్యేక రాయితీతో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సర్వీసులను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

ఘనంగా లింగమయ్య జాతర



మక్తల్: మండలంలోని కర్ని, రుద్రసముద్రం గ్రామాల్లో మంగళవారం లింగమయ్యస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాగులతో ఊరేగింపుగా ఆలయం దగ్గరకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా చుట్టు పక్కల వారు గుట్ట వరకు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం దగ్గర ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో కొలువైన పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్వ కులస్తులు గ్రామ పురవీధుల్లో బోనాలతో ఊరేగుతూ అమ్మవారి దేవాలయానికి చేరుకొని కోళ్లు, మేకలతో ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో భక్తులు కుర్వ అంజనేయులు, ఎల్లప్ప, భీంశప్ప, హనుమంతు, సాయ్‌బన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గజాలమ్మ జాతర

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం గజాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు బోనం కుండలతో ర్యాలీగా తరలివచ్చి అమ్మవారికి కోళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా అశోక్ నగర్ ఆలయంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి ప్రత్యేక పూజలు జరిపించారు.

రోడ్డు నిర్మాణం జరిగేనా..?

- 2018లోనే నిధులు విడుదల
- ఏడేళ్లు గడిచినా పూర్తి కాని పనులు



కుంటను తలపిస్తున్న రోడ్డు



అధ్వానంగా కొత్తపల్లి నుంచి బొడబండ తండాకు వెళ్లే రోడ్డు

కోస్గి (మద్దూరు) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో నిధులు మంజూరు చేస్తున్నారు. మట్టి రోడ్డు ఉంటే సింగల్ రోడ్డు, సింగల్ రోడ్డు ఉంటే డబుల్ రోడ్డు, డబుల్ రోడ్డు ఉంటే దానిని హైవేగా మార్చడం వంటి పనులు చేపడుతున్నారు. అయితే ఒక్క కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి తండా నుంచి బొడబండ తండాకు మాత్రం రోడ్డు మంజూరు కావడం కాలేదు. కొత్తపల్లి తండా నుంచి బొడబండ తండాకు దాదాపు 2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 2018లో ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి రూ.2.10 కోట్లు మంజూరు చేశారు. అయితే రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు అకాల మృతితో ఒక చోట కల్వర్టు పనులు చేసి రోడ్డు నిర్మాణాన్ని అలాగే వదిలేశారు. దీంతో రోడ్డు నిర్మాణం అప్పటి నుంచి ముందుకు సాగలేదు. రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో గుంతలమయమైన రోడ్డుపై కనీసం ఆటో వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

శాఖ మారడంతో సమస్య..

ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో చేపట్టిన పనులు నిలిచిపోవడంతో కొత్తగా రోడ్డు మంజూరు కోసం ప్రతిపాదనలు పెట్టడానికి వీల్లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు. దీనిపై కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ అధికారి (కడా) వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల నుంచి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులపై నివేదిక తెప్పించి ఇతర శాఖల ద్వారా నిధులు మంజూరు చేయించి రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

> **తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలి**
>
> 
>
> నియోజకవర్గంలోని ప్రతి తండాకు, గ్రామానికి సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారు. మా తండాకు గతంలో రోడ్డు మంజూరైనా పనులు జరుగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తగా రోడ్డు మంజూరు చేసి త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే తండా వాసులకు చాల మేలు జరుగుతుంది.
>
> – భాస్కర్ నాయక్, బొడబండ తండా, కొత్తపల్లి మండలం

పేదల బియ్యం పక్కదారి



రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న దళారులు

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిడ్జింతలోని రెండు చౌక ధర దుకాణాలకు మూడు నెలలకు సంబంధించిన బియ్యం రాగా రేషన్ డీలర్ లబ్ధిదారులకు ఈ నెల 1వ తేదీ నుంచి పంపిణీ చేపట్టారు. అయితే ఇదే అదనుగా దళారులు చౌక ధర దుకాణాల ముందే వ్యాపారం నిర్వహిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి రూ. 20కు కిలో చొప్పున కొనుగోలు చేసి దర్జాగా తరలిస్తున్నారు. ఈ విషయమై స్థానిక చౌక ధర దుకాణ డీలరును వివరణ కోరగా 'నా ఇష్టం నా పని నేను చేసుకుంటాను.. నీ పని నువ్వు చేసుకో' అని భయపెట్టినట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్‌ను వివరణ కోరగా దళారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోస్గి(మద్దూరు): పట్టణంలో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఆనంద్, నారాయణపేట డీటీ కాశప్ప, కోస్గి డీటీ భాస్కర్‌లు కలిసి పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో ఎండీ మహిమూద్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో దాడులు నిర్వహించగా 58 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. ఇదే సమయంలో రెనివట్ల గ్రామానికి చెందిన గోవిందు ఆటోలో 2 బస్తాల బియ్యం, నాగంపల్లి గ్రామానికి చెందిన నరేష్ ఆటోలో 6 బస్తాల బియ్యాన్ని అమ్మకానికి తీసుకోగా దానిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరు ఆటో డ్రైవర్లపై అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రం యజమాని మహిమూద్‌పై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన మొత్తం 66 బస్తాల బియ్యాన్ని ఖాజీపూర్ డీలర్ బి.శ్రీలతకు అప్పగించారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం



నారాయణపేట: నారాయణపేట పట్టణ, మండలంలోని 214 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి మంగళవారం వారికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

దామరగిద్ద: పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల లబ్ధిదారులకు పనుల పురోగతి ఆధారంగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ సాయిలక్ష్మి, విండో అధ్యక్షుడు ఈదప్ప, మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

మరికల్: పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈఓ మనోరంజని అన్నారు. మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజనం తయారుచేసే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే సంకల్పంతో ఉందని, ఇందులో తేడా లేకుండా విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ధన్వాడ: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ నరసింహచారి సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన వంట కార్మికులు, స్కావెంజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వంట ఎలా చేయాలి.. వంట అనంతరం గదిని ఎలా శుభ్రం చేసుకోవాలని అలాగే పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొండాపూర్ హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అనుచరుల సంబరాలు



నారాయణపేట: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని నియమించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన పర్ణికారెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మరో కీలక పదవిని కట్టబెట్టడంతో నియోజకవర్గంలోని ఆమె అనుచరులు బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు.

'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం



అమీన్‌పూర్ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని కోస్గి , గుండుమాల్ మండల తహసీల్దార్‌లు బక్క శ్రీనివాసులు , భాస్కరస్వామి అన్నారు. మంగళవారం కోస్గి మండలం వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించగా బిజ్జారంలో 01, కోస్గిలో 32 ఫిర్యాదులు రాగా గుండుమాల్ మండలంలోని ముదిరెడ్డిపల్లిలో 2 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో యంఆర్‌ఐ సుభాష్ , వెంకట్రాములు, సీనియర్ అసిస్టెంట్ రా మేశ్వరమ్మ , జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్, మహేష్ , స్వాతి, జ్యోతి, పాండు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో మంగళవారం కూడా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పెద్దజట్రం, అమీన్‌పూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయగా 110 మంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకటేష్, రాజప్ప పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించేందుకు సంబంధిత పాఠశాలలకు మంగళవారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు గుండుమాల్ ఎంఈఓ శేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 24 పాఠశాలలకు గాను ఇప్పటి వరకు 16 పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందచేశామన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి బడుల్లో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ దస్తయ్య , పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వం కల్పించిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆంజనేయులు సూచించారు. నిడ్జింత ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పలువురు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న అల్పాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకొని చదువులో ప్రతిభ కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్, వేణుగోపాల్, దేవేంద్రప్ప, వెంకట్ రాములు, వెంకట్‌రెడ్డి, నగేష్, వరలక్ష్మి, పీడీ కతలప్ప, ఓఎస్ షఫి తదితరులు పాల్గొన్నారు

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అమలు చేయాలి



తహసీల్దార్ మహేశ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కోస్గి (మద్దూరు): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ మహేశ్ గౌడ్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థికసాయం అందజేయాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నర్సింములు, నాయకులు వెంకటప్ప, అంజి, కన్నప్ప, ఎస్. వెంకటప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బడి ప్రచార రథాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరుస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సర్కారు బడులను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు గుంపు బలరాజ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ తపస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మొగుల్‌మడ్క బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారెడ్డి

కృష్ణా: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో కూడా మెరుగైన విద్యను అందిస్తున్నట్లు ముడుమాల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శేఖర్ అన్నారు. మంగళవారం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేరిపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల, పులిమామిడి, పెద్దజట్రం, ఊట్కూరు తదితర గ్రామాలలో ఉపాధ్యాయ బృందం ఇంటింటికి వెళ్లి బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సేవలను వారికి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫజల్ రహమాన్, అఫ్జల్, కతీజాభాను తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మొగుల్‌మడ్క, అన్నాసాగర్, పాఠశాలల పరిధిలో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మక్తల్‌లో మున్సిపల్ వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 10 వ వార్డులో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అలాగే తడి, పొడి చెత్త వేరు చేసి సిబ్బందికి అందజేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ శంకర్‌నాయక్, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అ1ందరి బాధ్యత

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా 9వ రోజు మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో తడి-పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి సిబ్బందికి అందించాలని తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. అలాగే వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. అమృత్‌జల్ పథకం ద్వారా ఇక ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేకల రాజేష్ , మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నారాయణపేట: రాష్ట్ర మంత్రిగా నియమితులైన మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరిని మంగళవారం నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంతకుమార్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

మద్దూరు: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని షా గార్డెన్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి నివాళులర్పించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. మోదీ హయాంలో దేశంలో జరిగిన అభివృద్ధిపై చర్చించారు. అనంతరం 46 మందితో కూడిన నూతన మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మదన్, మండల అధ్యక్షుడు శంకర్, భరత్, పాల్గొన్నారు.

కళాశాలలో చేరాలంటూ ఇంటింటి ప్రచారం



మద్దూరు: మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలంటూ కళాశాల అధ్యాపకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మద్దూరు, పల్లెర్ల, చింతల్‌దిన్నే గ్రామాల్లో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాల ప్రత్యేకతలను వివరించారు. అలాగే అన్ని గ్రూపుల సబ్జెక్టులు బోధించడానికి అధ్యాపకులు ఉన్నారని, విశాల తరగతి గదులు, ఆట స్థలం, ల్యాబ్ సౌకర్యం ఉందని కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రాములు, అధ్యాపకులు సురేష్, సంతు నాయక్, రమేష్, లక్ష్మిరెడ్డి, విజయకాంత్, శ్రీనురెడ్డి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట: ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం నారాయణపేట బస్టాండ్, బ్యాంకుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే బ్యాంకులు, ఏటీఎంల దగ్గర అపరిచిత వ్యక్తులు చేప్పే మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్వ: పేదలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్వ మండలం పెద్దకడ్మూర్ గ్రామానికి చెందిన వెంకట్రాములు గౌడ్, జక్కన్నపల్లి గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డికు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు కాగా ఒక్కొక్కరికి రూ.23,500 మంజూరు కాగా చెక్కులను బాధితులకు అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నర్వ సింగిల్ విండో వైస్ చైర్మెన్ లక్ష్మన్న, పెద్దకడ్మూర్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎం.రాములు, బీఆర్‌ఎస్ యూత్ నాయకులు లంకాల్ జనార్ధన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మాగనూర్ ఎంపీడీవో రహ్మతుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని, నిధులు లేక చెక్కులు జనరేట్ చెయ్యని పెండింగ్ బిల్లుల వివరాలు సేకరించి నిధులు విడుదల చేయాలని కోరారు. ముఖ్యంగా నాలుగు సంవత్సరాల విధి నిర్వహణ కాలాన్ని సర్వీస్‌గా పరిగణిస్తూ ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేటుగా దీటుగా ప్రభుత్వ కళాశాలలు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని డీఐఈఓ సుదర్శన్ రావు అన్నారు. స్థానిక ఇంటర్ కార్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రవేశాల కరపత్రాన్ని మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో బోధన చేయిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీల్లో చేర్పించాలని కోరారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ

మాగనూర్: మండలంలోని బైరంపల్లి, నేరడగం గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను ఎంపీడీఓ రహ్మతుద్దీన్ మంగళవారం పరిశీలించారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో వన మహోత్సవంలో చెట్లు నాటడానికి అనుకూలమైన స్థలాలు చూడాలని సిబ్బందికి సూచించారు.